క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నితీష్ (ఫైల్)

నడికూడ : కుటుంబ కలహాలతో పురుగులమందు తాగి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన రాయపర్తి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తికి చెందిన కూరాకుల నితీష్(22) కొన్ని రోజుల క్రితం కుటుంబ కలహాలతో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సీఎం రేవంత్‌ను కలిసిన ‘ఇనగాల’



ఆత్మకూరు : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కను కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కుడా చైర్మన్‌గా నియామకమైన సందర్భంగా ఆయకు శుభాకాంక్షలు తెలిపగా, వెంకట్రామ్‌రెడ్డి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



దామెర : బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. దామెర మండల కేంద్రానికి చెందిన మేరుగు సంపత్ ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. కాగా 1993–94 విద్యాసంవత్సరంలో అతనితో కలిసి పదోతరగతి చదివిన మిత్రులు బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. అనంతరం రూ. 22,000లను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కదారి రమేష్, నాగబెల్లి ఐలయ్య, రమేష్, మల్లయ్య, రవి, రాజు, ప్రేమ్‌కుమార్, సతీష్, రవి ఉన్నారు.


నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నడికూడ : మండలంలోని ధర్మారం, కంఠాత్మకూర్, రామకృష్ణపూర్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వన్యప్రాణులను సంరక్షించాలి

శాయంపేట : వన్య ప్రాణులను వేటగాళ్ల నుంచి రక్షించేందుకు అటవీ అధికారులు చర్యలు చేపట్టాలని ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యుడు మారెపల్లి సునీల్ కోరారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో నిరంతరం అడవిపందులను వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్నారని తెలిపారు. వేటగాళ్లు విద్యుత్ తీగలు, ఉచ్చులను బిగిస్తూ వన్యప్రాణులను వేటాడుతున్నారని అన్నారు. ఇటీవల పత్తిపాక గ్రామంలో వేటగాళ్లు అడవిపందిని చంపి విక్రయాలు జరుపడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదని ఆరోపించారు. గతంలో వన్యప్రాణుల వేటకు విద్యుత్ తీగలు అమర్చడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇటీవల వన్యప్రాణులను రక్షించాలని పత్తిపాక గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి హెచ్చరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ప్రత్యేక అలంకరణలో ఆదిగణపతి



కాజీపేట : కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీ స్వయంభు శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో కొలువుదీరిన ఆదిగణపతిని పసుపుతో అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుల పర్యవేక్షణలో అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి పసుపు, పూలు, నూతన వస్త్రాలతో అలంకరించారు.

భగీరథ పైపులైన్ కోసం రోడ్డు ధ్వంసం

- కొరవడిన అధికారుల ముందుచూపు
- గుంతలుగా మారుతున్న సీసీరోడ్డు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


శాయంపేటలో సీసీరోడ్డుకు డ్రిలింగ్ చేస్తున్న సిబ్బంది

శాయంపేట : కోట్లాది రూపాయలతో నిర్మించిన సీసీరోడ్డు ధ్వంసం అవుతుంది. మిషన్‌భగీరథ పైపులైన్ ఏర్పాటు చేసేందుకు సీసీరోడ్డును డ్రిల్లింగ్ చేస్తూ గుంతలమయంగా మార్చుతున్నారు. మండలంలోని మాందారిపేట స్టేజీ నుంచి ప్రగతి సింగారం గ్రామం వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో రోడ్డు విస్తరణ పనులకు రూ. 6కోట్ల 9 లక్షలతో పనులను చేపట్టారు. ఈ నిధులతో పాటు ఈజీఎస్ నిధులను కలిపి శాయంపేట మండల కేంద్రంలో సీసీరోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆ రోడ్డు పనులు చేపడుతుండగానే మిషన్‌భగీరథ పైపు లైన్లు చాలా చోట్ల పగిలిపోవడంతో పైపులైన్ తొలగించారు. కొన్ని చోట్ల మరమ్మతులు చేశారు. రోడ్డు నిర్మాణం జరుగుతున్నప్పుడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తుగా రోడ్డు కింద పైపులైను ఏర్పాటు చేయలేదు. రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక రోడ్డు కింద ఉన్న భగీరథపైపులైన్ తరచూ లీకేజీలు కావడంతో జేసీబీతో రోడ్డు కింద మట్టి తవ్వకాలు చేపట్టి పైపులైన్ మరమ్మత్తు చేస్తున్నారు. చాలా చోట్ల లీకేజీలు కావడంతో ఇటీవల రోడ్డు ప్రక్కన ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలుర పాఠశాల సమీపంలో గురువారం మిషన్ భగీరథపైపు లైన్ ఏర్పాటు చేసేందుకు సీసీరోడ్డును డ్రిలింగ్ చేశారు. అధికారులు ముందస్తు ఆలోచన చేయకుండా కోట్లాది రూపాయల ప్రజాధనంతో వేసిన రోడ్లను డ్రిల్లింగ్ చేస్తూ ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

‘నిబంధనలకు విరుద్ధంగా తరగతుల నిర్వహణ’

దుగ్గొండి : మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తున్నారని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఒంటి పూట బడుల నిర్వహణకు ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ, విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తోందని చెప్పారు. ఎండల తీవ్రత నేపథ్యంలో విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మధ్యాహ్నం వరకు మాత్రమే తరగతులు నిర్వహించాల్సి ఉండగా సాయంత్రం వరకు నడపడంతో విద్యార్థులు నీరసించిపోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయవాది సునీత

నర్సంపేట : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రముఖ న్యాయవాది సునీత కోరారు. పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించగా న్యాయవాది సునీత అతిథిగా హాజరై మాట్లాడారు. హక్కులను పరిరక్షించడంతోపాటు బాల్యవివాహం, మహిళల అక్రమ రవాణా, వరకట్న, గృహహింస, తదితరాల బారి నుంచి కాపాడేలా అనేక చట్టాలున్నాయని చెప్పారు. ఎలాంటి సమస్యకైనా పరిష్కారం ఖచ్చితంగా ఉంటుందన్నారు. విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకుంటే భవిష్యత్‌లో సమస్యలను సులువుగా అధిగమించవచ్చని చెప్పారు. సదస్సులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పెండెం రాజేశ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఓటు సద్వినియోగం



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారానే ప్రజలు ఓటును సద్వినియోగం చేసుకోగలరని ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. స్వీప్–2024లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య ఈసీ సభ్యులకు క్యాంపస్ అంబాసిడర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో నూరు శాతం ఓట్లు పోలయ్యేలా చూడాలని చెప్పారు. అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించి పోలింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. తద్వారా సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఎంఈఓ రంగయ్య, ఎంపీఓ ధనలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్


సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న శివకుమార్, నాయకులు

నెక్కొండ : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్ తెలిపారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు నేపథ్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడారు. మున్నూరుకాపు కులస్తులు విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పడాల రవికుమార్, నాయకులు గై లక్ష్మణ్, ఎడ్ల కిష్టయ్య, సురేందర్, యాకయ్య, హరికృష్ణ, సత్యనారాయణ, నరేశ్, రాజు, సందీప్, బుచ్చయ్య, నగేశ్, కుమారస్వామి, సుమన్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో మొక్కల సంరక్షణ


మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీఓ ప్రకాశ్

నల్లబెల్లి : జీవామృతంతో నర్సరీల్లోని మొక్కలను సంరక్షించొచ్చని ఎంపీఓ కూచన ప్రకాశ్ తెలిపారు. మండలంలోని నందిగామ, రేలకుంట, రంగాపురం, ముచ్చింపుల, ముచ్చింపుల తండా, అర్షనపల్లి, రాంతీర్థం, కన్నారావుపేట, బుచ్చిరెడ్డిపల్లి, తదితర గ్రామాల్లోని నర్సరీలను గురువారం ఆయన సందర్శించారు. నర్సరీల ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు వివరించారు. జూన్‌లో ప్రభుత్వం నిర్వహించనున్న హరితహారం కార్యక్రమ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని చెప్పారు. నర్సరీల్లో జీవామృతం తయారు చేసి అందుబాటులో ఉంచాలని తెలిపారు. జీవామృతాన్ని క్రమం తప్పకుండా మొక్కలపై పిచికారీ చేయాలని సూచించారు. ప్రాథమిక నారుమడిని ఏర్పాటు చేయాలన్నారు. మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్య తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

వాహనాల తనిఖీ



వర్ధన్నపేట : పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని కోడ్ అమలులో భాగంగా పట్టణ పరిధిలోని డీసీ తండా సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసులతో కలిసి అధికారులు గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయసాగర్ మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బులు, మద్యం పంచకుండా ఉండడానికి పటిష్టమైన చర్యలు చేపడతున్నామని చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. డబ్బు, వస్తువులు, ఇతర బహుమతులు పంపిణీ చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. ఎన్నికల నియమావళికి పాటించాలన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కేయూ క్యాంపస్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత సాధ్యమని కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ తాటికొండ రమేష్ అన్నారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలోని సెనెట్‌హాల్‌లో గురువారం శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, కన్హా శాంతివనం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధ్యానం, రిలాక్సేషన్, స్వచ్ఛతలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వీసీ మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ప్రశాంతత తప్పనిసరి అన్నారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆదిత్యఆర్య కీలక ఉపన్యాసం చేశారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి వచ్చిన డాక్టర్ అరిహంత మాధవ మోహన్ , లోకల్ ఇన్‌చార్జ్ శారద, రమణ, ఆచార్య గార్లపాటి అచ్చయ్య పాల్గొన్నారు.

కనీస వేతనాల జీఓను సవరించాలి

హన్మకొండ చౌరస్తా : పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాల జీఓను సవరించాలని కోరుతూ ఆల్‌షాప్స్ వర్కర్స్ యూనియన్ బాధ్యులు గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ.28,223 కనీస వేతనం అందించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మహబూబ్, రాఘవులు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందనలు



కేయూ క్యాంపస్ : కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వశాఖ, జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఈనెల 22నుంచి 28వ తేదీ వరకు కర్ణాటకలోని జనపదలోక రామనగర ప్రాంతంలో నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి 10మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. ఈనేపథ్యంలో ఎంపికైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను గురువారం కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, ప్రవీణ్‌కుమార్, డాక్టర్ రాధిక అభినందించారు.

పౌరసత్వ బిల్లుపై రాజకీయం చేయొద్దు

హసన్‌పర్తి: పౌరసత్వ సవరణ బిల్లుపై రాజకీయం చేయొద్దని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు. హసన్‌పర్తిలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఏఏ అనేది భారతీయ ముస్లింకు సంబంధించిన బిల్లు కాదన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్ లాంటి ముస్లిం మెజార్టీ దేశాల్లో ఉన్న హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, క్రైస్తవులు భారతదేశానికి వలస వచ్చి ఎన్నో ఏళ్లుగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారిని భారత పౌరులుగా గుర్తింపు ఇవ్వడానికి తెచ్చిందే అని పేర్కొన్నారు. అపోహలతో అయోమయానికి గురికావొద్దని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాంచంద్రారెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, తిరుపతి, దాసరి రాజు, హరిశంకర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి

హన్మకొండ: స్వశక్తితో స్వయం ఉపాధి పొందుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఉషా ఇంటర్నేషనల్ డిప్యూటీ మేనేజర్ రాజ్‌కుమార్ సూచించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ రాంనగర్‌లో రిసోర్స్ పర్సన్ శిక్షణ కార్యక్రమంలో రాజ్ కుమార్ మాట్లాడారు. గత 13 సంవత్సరాలుగా ఉష ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో దేశంలో దాదాపు 12 లక్షల మంది మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చామని తెలి పారు. రాష్ట్రంలో 465 ఉషా సిలాయి స్కూల్స్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ పేద మహిళలకు ఉపాధి పెంపొందించుటకు ఉషా ఇంటర్నేషనల్ వా రు ఉచితంగా టైలరింగ్‌లో మెళుకువలు, కుట్టు మెషిన్ రిపేరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపా డు దామోదర్ మాట్లాడుతూ.. సంస్థకు సహకరిస్తు న్న ఉషా ఇంటర్నేషనల్ వారికి కృతజ్ఞతలు తెలిపా రు. విశ్వకర్మ యోజన పథకంలో నమోదు చేసుకోవడం ద్వారా కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలు మాస్టర్ ట్రైనర్లుగా అవకాశాలు పొందవచ్చన్నారు.

ఆడపిల్లతో ఇంటికి వెలుగు : ఐసీడీఎస్ సూపర్‌వైజర్


ఆడపిల్లల సంరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

ఆత్మకూరు : ఆడపిల్లలు ఇంటికి వెలుగునిస్తారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. మండలంలోని నీరుకుళ్లలో అర్షం రాజేందర్ – నీలిమ, అర్షం వరుణ్‌గాంధీ – సరిత దంపతులకు ఆడపిల్లలు జన్మించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి నూతన వస్త్రాలు సమర్పించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లలను చదివించి సంరక్షించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. పురుషులతో సమానంగా ఆడపిల్లలను చదివించి అన్నిరంగాల్లో రాణించే విధంగా తయారు చేయాలని సూచించారు. ఆడపిల్ల జన్మిస్తేనే అదృష్టంగా భావించాలని అన్నారు. అనంతరం ఆడపిల్లల సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ టీచర్లు మానస, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేకుండా ఇసుక రవాణా చేయొద్దు


ట్రాక్టర్ పట్టుకున్న ఎస్సై

దామెర : అనుమతిలేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా కేసు నమోదు చేస్తామని ఎస్సై అశోక్ హెచ్చరించారు. మండలంలోని మల్లిపల్లిగూడెంకు చెందిన పసుల అర్జున్ తన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నాడు. కోగిల్వాయి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులకు ఇసుక ట్రాక్టర్ తారసపడినట్లు తెలిపారు. దీంతో తనిఖీ చేయగా అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అర్జున్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా మండలంలో ఇసుక, మొరం తరలిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమంగా ఇసుక తరలింపు చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు

ఎల్కతుర్తి : మండలంలోని జీల్గుల, జగన్నాథపూర్ గ్రామాల్లో పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 350 పశువులకు గర్భకోశ, గాలికుంటు, చూడి, సంబధిత పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవీఏహెచ్ఓ డాక్టర్ వెంకట్‌నారాయణ, పశువైద్యధికారులు దీపిక, అర్చన, కళాశాల అధ్యాపకులు ఉషారాణి, సురేష్, విజయలక్ష్మీ, ఆనంద్, అమృత్, సంపత్, వంశీకృష్ణ, శ్రీను, రమ్య, విజయ్‌భాస్కర్, రాజశ్రీ, అనూష, ప్రీతి, రమేష్, తేజ, కనుకయ్య, ఉమా, 39మంది యూనివర్సిటీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీతో పాఠశాలలు బలోపేతం


ఎన్నికైన కమిటీ సభ్యులతో ఉపాధ్యాయులు, తదితరులు

ఐనవోలు : అమ్మ ఆదర్శ కమిటీలతో పాఠశాలలు మరింత బలోపేతం కానున్నాయని సింగారం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రాజు అన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. చైర్‌పర్సన్‌గా మహిళ సంఘాల అధ్యక్షురాలు ఖాతా వెంకటమ్మ, కన్వీనర్‌గా హెచ్ఎం శ్రీనివాస్‌రాజు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రతీ తరగతి నుంచి పిల్లల తల్లులు, మహిళా సంఘ సభ్యులను ముగ్గురు చొప్పున ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు. సీనియర్ ఉపాధ్యాయుడు వెంకటయ్య పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు సరిపడా అందించాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు : రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు రంజాన్ కానుకలు సరిపడా అందించాలని మాజీ కోఆప్షన్ సభ్యుడు బాబుమియా అన్నారు. మండలానికి చెందిన ముస్లింలకు నిధులు కేటాయించాలని కోరుతూ పరకాల ఆర్డీఓ నారాయణకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాబుమియా మాట్లాడుతూ.. మండలానికి రూ.లక్ష నిధులు, 1500 తోఫా ప్యాకెట్లు అందించాలని కోరారు. ప్రతి ముస్లిం కుటుంబానికి తోఫా చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మైనారిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నిధులకు మంజూరు ప్రత్యేక చొరవ చూపాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమజాన్ అలీ, సర్వర్ పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

గీసుకొండ : పల్లె దవాఖాన వైద్యులు గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపి మెరుగైన వైద్య సేవలు అందించాలని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పల్లె దవాఖానా వైద్యులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతాశిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా గర్భిణుల వివరాలను నమోదు చేసి, వారికి మూడు పరీక్షలు ఉచితంగా నిర్వహించాలన్నారు. ఉచితంగా ధనుర్వాతం టీకా, ఐరన్ ఫోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లను అందించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవించే విధంగా వారిని మానసికంగా సిద్ధం చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనవసరమైన సిజేరియన్లు, అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ వెంకటరమణ హెచ్చరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్లు చేయించుకుని నిబంధనల ప్రకారం వైద్య సేవలు అందించాలన్నారు. గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధార్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

నర్సంపేట : వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. ఇటీవల పట్టణంలోని నల్లాల బావి, ఫిల్టర్ బెడ్, వరమ్మతోట బావిని మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరిశీలించిన సమయంలో అధికారులకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు తాగునీటి ఏర్పాట్లను చేపట్టి నల్లాల బావి వద్ద సిబ్బందితో పనులు చేపట్టారు.